కథానిక

# ధనదాహము - యుద్ధోన్మాదము

— రంధి సోమరాజు

ఒకటి నిజం! భీమరాజు ఒకటో రకం తెలివైనవాడు. తెలివి వేరు. మంచితనం వేరు. ఇది అందరికీ తెలిసిన సత్యమే! అయితే ఏది సత్యం... ఏది అసత్యం— అన్న తర్జన భర్జన వుండనేవుంది దాన్ని ఆధారం చేసుకొని, ఆ సత్యాసత్యాలను లోలోతుగ త్రవ్వి తవ్వి సత్యాన్ని అసత్యంగాను, అసత్యాన్ని సత్యంగాను తారుమారు చేసి చూపడంలో భీమరాజుకు మరొకరు సాటివుండరు.

ఇదీ ఆయనగారి ఘనత! ఈఘనతకాధారం ఆయన తెలివి. అయితే అతని తెలివినిబట్టి అతని ఘనత పెరిగిందో ఘనతను పురస్కరించుకొని తెలివి విజృంభించిందో అప్పుడప్పుడు అతనికీ అనుమానంగానే ఉంటుంది!

ఇంతకీ మనలో మనమాట అతని దగ్గర కుప్పతిప్పలుగా డబ్బుమూలుగుతోంది. కొందరికి తెలివితేటలువల్ల డబ్బు లభిస్తుంది. మరికొందరికి డబ్బుతో తెలివితేటలు పుట్టుకొస్తాయి నిజానికి భీమరాజు ఈ రెండు తరగతులకూ చెందుతాడు. అతనికే ఆలోచన కలిగినా మొదట్లో విస్తృత మానవాభ్యుదయానికే ఉపయోగపడేట్లుంటుంది. ఆతరువాత అది పిచ్చిమత వాదంలా, ఇజంల అంతరంగిక ఆగాతత్వంలా రూపాంతరంచెంది, దానితాలూకు అభ్యుదయం అంతా అతనికి కావలసిన ధనరూపంగా అవతరించి అతన్ని వరిస్తుంది.

అతను కాలేజీలో చదివేటప్పుడు పాపం కొడుకెక్కడ డబ్బులేక అవస్థ పడతాడో అని అతని తండ్రి ఎంత పిల్చినా తరగని కల్పవృక్షం సిగరెట్ల లాంటి డబ్బుకట్టల్ని మనియార్డరు పెట్టెల్లో పెట్టి వారం వారం పంపేవాడు చెక్కుల్లో కుక్కి ఆడబ్బుపంపితే బ్యాంకులచుట్టూ తిరుగుతూ కొడుకు

రంధి సోమరాజు

తన అమూల్యమైన టైము పాడుచేసు కోవలసి వస్తుందని, కాస్త కమీషను హెచ్చయినా, డబ్బు మనియార్డరు రూపంలో పంపి తిరిగి వచ్చిన ఆ యమ్. ఓ. తాలూకు రశీదుమీది కుమారుని అందమైన "అభిమాన సంతకం" కళ్ళారచూసి భగవంతుడు ప్రత్యక్షమైనట్లు ఆ కుమార భక్తుడు సంతసించేవాడు.

డబ్బు అందుకున్న భీమరాజు తిన్నగా ఆడబ్బు బ్యాంకులో డిపాజిట్టుచేసి, డబ్బులేనివాడిలా మొగాన్ని కత్తిరించి దాన్ని స్నేహితులముందు నిలబెట్టేవాడు. కత్తిరించబడ్డ ఆ మొగంలోంచి నెత్తురుకన్నా ముందు లేమి జారిపడేది. కాని ఆ మిత్రుల కది కలిమిగానే కనిపించేది. ఈదొంగ మిత్రులు ఎక్కడ పసిగడతారో అని పోస్టుమేన్ రాగానే అతన్ని చాటుగా తీసునపోయి గుప్ చిప్‌గా "సంతకం తాళం" చెవితో ఆడబ్బు స్వాధీనం చేసుకొనేవాడు.

ఏదైవా ఒకదేశం తనజాతి నెత్తురులోని ప్రతి నెత్తురుబొట్టునూ నెత్తురు సిపాయికింద మార్చిందనుకోండి; ఆ నెత్తురుకు ఎప్పుడూ నెత్తురు త్రాగాలనేవుంటుంది. నెత్తురుతప్ప ఇంకొకటేమీ దానికి రుచించదు. అది దాని లక్షణం. దీనికి ఎవరేంచేస్తారు? ఈ రక్తదాహాన్ని అది, అదిదాచేసి అది మజ్జిగ కావాలన్నట్టు ఎప్పుడూ నోరు చాస్తూ వుంటుంది. పెద్దపులి వంకాయలు కోరినట్టుగా వుంటుంది దాని తత్వం. అలాగే అలాగే ఈ డబ్బున బుజ్జి అబ్బాయికికూడ పాపం ఎంతో ఎంతో ధనదాహంవుంది. ఈ ధనదాహము పట్టిన బాబులకూ ఆ నెత్తురు దాహం పట్టిన ఇజంలోని నగ్నసత్యానికి తేడా ఏమీ వుండదని మీకూ నాకూ తెలిసిపోతూనే వుంటుంది. అయితేఏం ఈ సత్యం ఆ ఇద్దరికీ తెలియదు ఈ బుద్ధులు రెండూ మంచికి ఉపయోగించుకుంటే మంచిది కాని మిమ్మల్నీ నన్నూ తినెయ్యడాని కుపయోగిస్తే ఏం మంచిది చెప్పండి?

భీమరాజు స్నేహితుల కందరికీ అతని దగ్గర డబ్బుందని తెలుసు. ఆ విషయంలో అతని కాలిగోటికికూడ పనికిరాం అన్న బానిస లక్షణం. వాళ్ళను ఆడబ్బు బాజాకు లొంగిపోమని అతనిచుట్టూ భజన చేయమని "ఇజాల పేర్లమికుల్లా" తమ సర్వస్వాన్నీ ఆ వీరభీముడికి అర్పించమని పురికొల్పుతోంది

వీళ్ళతత్వం కనిపెట్టి "మన అందర్నీ బాగుకి ఓ మంచి పథకం" అన్నాడు భీమరాజు. ఏమిటన్నారు మిత్రులు. మన మెస్ మనమే నడుపుకుందాం అన్నాడు. చేరని వాళ్ళను దుయ్యబట్టాడు. చేరినవాళ్ళకు సహకారం

లోని ఉపయోగ శతకాన్ని అచ్చు వేయించి అమ్మాడు. మెస్ నడిపి, అందరి చేతుల్లోనూ మసిని మిగిల్చి మొగాలకు పులుముకో మన్నాడు. ఎలాగైనా వాళ్ళు భక్తులుకదా... వాళ్ళల్లో ఉన్న ఇద్దరు ముగ్గురు నాయకుల్లాంటి బుల్లిరాజులకు "సినిమా ఆదర్శం" వాళ్ళకే ఖర్చు లేకుండా చూపించి; మరునాడు వాళ్ళచేత ఆ ఆదర్శాన్ని మిగిలినవాళ్ళకు అమ్మించాడు. ఆదే ఆదర్శం అనుకున్నవారికదే దొరికింది!

ఇంతటి శక్తిమంతుడైన భీమరాజు గారి వివాహం గురించిన చిన్నకథ చెప్పుకోకుండా ఉండడం ఏమంత మంచిది కాదు.

ఊళ్ళో డబ్బు ఉన్న అమ్మాయి ఎవ్వరా అని చూశాడు. నిజానికి శక్తి ఉన్నవారికి గుణం, రూపం అక్కర్లేదు. యౌవ్వనమే కావాలి. అలాగే అలాగే డబ్బు కావలసిన వారికి డబ్బే కావాలి. ఆ అమ్మాయి ఇంతకుపూర్వం ఎవ్వరినో ప్రేమించిందని తెలుసుకున్నాడు. ఆమెచుట్టూ తిరిగాడు ఆమెసనేమీ మనసుమార్చుకోనంది. భీమరాజుకు మనసంటే ఏమిటో అర్థంకాలేదు. జరగవలసింది క్రియ అనుకున్నాడు. ఎలాగ తెలుసుకున్నాడో ఆ చిన్నారి, తను ప్రేమించిన ప్రియుణ్ణి కొత్త తెలుగు సినిమాకు మొట్టమొదటిరోజున, మొట్టమొదటిఆటకు టిక్కెట్లు కొనమన్నదని తెలుసుకున్నాడు. సరే అనుకున్నాడు.

ఇహ ఆ "పిల్లప్రియుడు" అడ్వాన్సు బుకింగ్ లో అతికష్టంమీద టిక్కెట్లు తీసుకున్నాడు. టిక్కెట్లుంటే ఏ ఇక్కట్లూ రానట్టు తను పడ్డశ్రమ అంతా ఆ అమ్మాయికి నివేదించాడు. వేళ కాగానే సినిమా హాలువద్దకు ప్రియురాలిని తీసుకెళ్ళాడు. ఒక్కరూ లోపలికి పోకుండా వేలకొద్దీ జనం హాలు గేటు ముందు నిలబడిఉన్నారు. అందరికీ విపరీతమైన నిరాశకలిగేట్టుగా ఆ సినిమా హాలువాడు కొన్ని అనివార్య కారణాలవల్ల ఈ ఆటరద్దు చేయబడినది ఇప్పటి టిక్కెట్లు రెండవ ఆటకు చెల్లును అని ఓ బోర్డు పెట్టాడు. అంతా తిట్టుకుంటూ ఇళ్ళకు సాగిపోయారు.

మన భీమరాజు ప్రేమించిన "డబ్బు సుందరి" తన ప్రియుడితో, నీతో ఎప్పుడువచ్చినా ఇంతే అని విసుక్కుంది. ఇది ఆడవాళ్ళకు సహజమైన ధోరణి కావొచ్చు. కాని ఆప్రియుడికి ఆ ధోరణి అంతగా నచ్చలేదు. "ఇంతమంది ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోతూంటే నావల్లేజరిగినట్లు మాట్లాడుతావేం .." అన్నాడు. కుర్రతనంకదూ అచ్చంగా అలాగే అన్నాడు. ఆమెకు మండింది.

అతనికి మండింది. వాళ్ళిద్దరికీ మనసుల్లో ఒకరిమీద ఒకరికి చల్లని ప్రేమ ఉండనేవుంది. కాని వాళ్ళలా పైకి మండిపోతూన్న సమయంలో ఇలాగే జరగాలనుకుంటూ భీమరాజు వాళ్ళను ఆపుచేసి, "ఏం ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు" అన్నాడు. కారణం ఆ అబ్బాయి చెప్పాడు. ఆ అమ్మాయి మొగం ధుమధుమలాడుతోంది. అది భీమరాజుకు ఘుమఘుమ పరిమళంలా ఉంది. "అదేమిటి... మీరు వెనక్కి వెళ్ళడమేమిటి ... నేను మీ కా సినిమా చూపిస్తాను రండి ..." అన్నాడు. ఆమె ఆశ్చర్యపోయింది. "అదెట్లా" అంది. "ఎలాగైతే మీకెందుకూ..." అన్నాడు. "మీ రా బోర్డు చూడలేదుకాబోలు" అన్నాడు ఆ అమ్మాయి ప్రియుడు. భీమరాజు నవ్వాడు. ఆనవ్వు ఆ అబ్బాయి ప్రాణాలను అక్కడికక్కడే తీసి, మళ్ళీ ఎక్కడా కనబడకుండా పాతాళంలో పాతేసింది. "నేను చూపిస్తానంటున్నాగా.... మీరు వెనక్కి వెళ్తే నాప్రాణం పోతుందండీ ... ఆయన రాకపోతే పోనీలెండి..." అన్నాడు. ఆ అబ్బాయి అలాగే నిలబడిపోయాడు. ఆ అమ్మాయి భీమరాజుతో కదలిపోయింది. "ఇజాల్లోని పిచ్చిలాంటిదే" ఈ సినిమా పిచ్చి కూడాను. ఆమె భీమరాజును పరీక్ష చేయాలన్నట్టుగా కదలినా భీమరాజు మీద ఎంతో నమ్మకం ఏర్పడినట్లే కనబడింది భీమరాజు హాలులోనికి ఆమెను తీసుకెళ్ళాడు. "మీరంటే నాకెంత ప్రేమో మీకుతెలియదు. మీరూ నేనూ చూస్తూ వుండగా మరొక రెవ్వరూ ఈ సినిమా చూడగూడదని ఈహాలు వాడికి ఈ ఆటకువచ్చే డబ్బంతా ఇచ్చేసి ఈ ఆటను కొనేశాను. మిమ్మల్ని పొందగలిగాను" అన్నాడు అంతే ... ఆమె తన తండ్రిగారి తాలూకు లక్షలు లక్షలు చేసే ఆస్థి అంతా ఈ చిన్ని "మేజిక్ లా" ప్రదర్శనతో కరిగించేసి అతని ఇంటికి ఆ ప్రవాహంతోపాటు తరలి వెళ్ళిపోయింది.

ఇలాంటివాని తెలివితేటలు చెప్పుకుంటే "తెలివి పురాణం" ఒకటి తయారైందన్న మాటే. ఏతఛానికాతఛమే ఆయనగారి "మ్యూజియమ్ తెలివి" ఎక్కడికక్కడే అపురూప ప్రదర్శనలను ప్రదర్శిస్తుంది

అతను చేస్తూన్న వ్యాపారంలో క్షణక్షణం ఎదురయ్యే కష్టాలను "డబ్బు అనే గెరిల్లా సైన్యాన్ని" వెదజల్లి నష్టం రాకుండా కాపాడుకుంటున్నాడు ఎక్కడ ఏ శాస్త్ర ధన నిక్షేపం కనిపించినా, ధనం, ధనంతో కలసిపోవాలనే నినాదం ప్రసారం చేస్తూ, మనిషన్నవాడుంటే తన పార్టీ

వాడే అయివుండాలన్న ఉత్కృష్టమైన పట్టుదలలాంటి శక్తిని మూటగట్టు కుంటున్నాడు.

అతనికి లోకం కనిపించడంలేదు. అతనికి కనిపించేలోకం ఇతరులకు కన బడకుండా, మంచి బందోబస్తు చేసు కుంటున్నాడు. ఇది కనిపెట్టిన ఓ పిచ్చివాడు నీ అంతరాత్మ శిథిలమై పోతోంది దాన్ని కాపాడుకో అన్నా డు. ఆ పిచ్చివాడి పిచ్చికుదిరేట్టు భీమరాజు అరచాడు. "నేను పొందు తూన్న సుఖం ఈ ప్రపంచంలో ఎవ్వరూ పొందలేరు. నా ఆత్మా రామం బహు సుందరమైనది. దానికి పేర్లు పెట్టేవారు ఉత్త "లేమి బూర్జు వాలు" అన్నాడు. అనేక యుద్ధముల అరితేరి క్రూరమైన ముఖవర్చస్సుతో వెలిగిపోయే ఏకపక్ష పార్టీ నియం తలా మాటాడకుండా సమస్తాన్నీ కబళించ జూస్తున్నాడు కాని అతని ఆత్మ నిజంగానే శిథిలమైపోతోంది. శాంతి అనే మందు అతని దగ్గరకు చేరినప్పుడు దాన్ని దూరంగా విసిరి పారేశాడు. ఇప్పుడు దాని దగ్గరకు పరుగెత్తడానికి చెప్పరానంత సిగ్గుగా ఉంది.

ఈ బాధ భరించలేక అతను ఓ మంచి పని చేయాలనుకున్నాడు. తన ధనాన్నంతా శక్తిగా మార్చేయాలను కున్నాడు ఆటలపోటీలు వ్యాయామ పోటీలు పెట్టి వేలకొద్దీ బహుమానా లుపెట్టి దేశంలోని యువకుల నంద రినీ ఆకర్షించి వారికి పెద్ద పెద్ద మొత్తాలు బహుమతులుగా పంచా లనుకున్నాడు. ఇలా చేస్తే యువకు లంతా వీరులౌతారు. దేశానికి తన శక్తిని ప్రసాదించి చనిపోవడం మంచి దనుకున్నాడు అతనికి ఆరాత్రి పెద్ద కలవచ్చింది. ఏవీధిని చూసినా వ్యాయామ కళాశాలలే ... అంతా వీరులను తయారుచేసే యోధులే... పోటీలు పెట్టి డబ్బు ఎరగా పారేస్తే మనుషులు ఎలా ఎగబడతారు అను కున్నాడు. సైనికశక్తితో దేశాన్ని సుభిక్షం చేసేయగలం అనుకున్నట్లు, డబ్బుతో దేశాన్ని మార్చేయవచ్చు అనుకున్నాడు.

కాని నెలతిరక్కముందే ఆవూళ్ళో గొప్ప ఆటలపోటీలుపెట్టి ప్రజలకు వినోదాన్ని, పార్టీసూత్రాల ఆకర్ష ణల్ని అమ్మినట్లు అమ్మి డబ్బు చేసు కున్నాడు,

ఇలాంటి మేధావియైన ధనతంత్ర జ్ఞుడైన భీమరాజు ఒకరోజున ఉన్న ట్టుండి జబ్బుపడ్డాడు. డబ్బుతో మందులు కొనుక్కోవచ్చునుకున్నాడు కాని డబ్బుకు ప్రాణాల్ని అమ్మే షాపు ఎక్కడా కనిపించలేదు.

డాక్టర్లు పెదవి విరుస్తున్నారు. డబ్బు తక్కువని పెదవి విరుస్తున్నా

రేమో అని, "నా డబ్బంతా ఇచ్చే స్తాను నన్ను కాపాడండి" అన్నాడు. తన అభిమాన ధననినాదం అదొక విధమైన పార్టీ నినాదంలాంటిది విడిచి పెట్టడానికి అతని మనసు ససేమీ ఒప్పుకోడంలేదు. అయినా అలా అన్నాడు. కాని ఏ డాక్టరు, ప్రాణా లను కొని తీసుక రాగలడు? "మీరు అనవసరంగా ఆందోళన పడకండి. శాంతంగా ఉండండి అన్నారు డాక్టర్లు.

భీమరాజు "శాంతి ప్రాణం పోస్తుందా" అన్నాడు. డాక్టర్లకు ఏమి సమాధానం చెప్పాలో తోచ లేదు. "ఔను" అనా అనుకున్నారు. "కాదు" అనాలనుకున్నారు.

అప్పు డెవరో ఒక ముసలాయన వచ్చి, "బాబూ నువ్వు చేసిన మంచి పని ఒకటి తలచుకో హాయిగా ప్రాణం పోతుంది" అన్నాడు.

భీమరాజు తనుచేసిన మంచిపను లేమిటో గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. ఓ నేను కావలసి నంతమంది గుమస్తాలను పోషించాను. వాళ్ళకు నేనే లోపం చేయలేదు అన్నాడు. "ఓ...మా దేశంలో కూడు గుడ్డ కేలోపంలేదు" అని ఎవ్వరో నియంత అన్నట్లు ఆమాటలు ధ్వనిం చాయి.

"బాబూ వారు నీచేతికింద బితుకు బితుకుమని బతికారు. వారి గుండెల్లో ఏనాడూ ప్రాణంలేదు. ఉన్న దేదో వారి చేతుల్లోను కాళ్ళల్లోను ఉండేది" అన్నాడు ముసలివాడు.

భీమరాజుకు ఆయాసం అధికంగా ఉంది. "అయితే తాతగారూ వారి ప్రాణాలను నేనే తినేశానంటూరా." అన్నాడు.

"ఔను బాబూ వారిలో నిజమైన ప్రాణం ఎప్పుడో చచ్చిపోయింది" అన్నాడు.

భీమరాజు మొగం వికృతమై పోయింది. ధనం యొక్క నికృష్ట రూపం అతని మొగంమీద వ్రేలాడు తోంది.

"ఎందుకిలా జరిగింది తాతగారూ" అన్నాడు. అతని కనులలో నీళ్ళు కదలుతున్నాయి.

తాత మెల్లిగా అమృతం చిలుకు తూన్నట్లు "మంచిని మరచిపోయావు నాయనా" అన్నాడు.

ఈ మాట భీమరాజుకు వినబడింది. అప్పుడు పెద్దపెట్టున గాలి వీచింది. ధనదాహాన్ని, క్రౌర్యాన్ని ఈ లోకంలో ఉండకుండా తోలేస్తూ న్నట్లు ఒక్కసారి ఉప్పెనగా గాలి విజృంభించింది. ఆ తాకిడికి ఆ ఇంటి లోని విద్యుద్దీపంకూడ ఆరిపోయింది!

అంతే ...